**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

విజయవాడ,
**తేది : జనవరి 19, 2017.**

## విద్యుత్ ఛార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలి

విద్యుత్ ఛార్జీలు పెంచుతూ డిస్కాంలు చేసిన ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. మిగులు విద్యుత్ ఉందంటూనే ప్రజలపై ఛార్జీల భారం మోపడం గర్హనీయం. శ్లాబుల కుదింపు, డిమాండ్ ఛార్జీ-ఎనర్జీ ఛార్జీ పేరిట విడదీయడం లాంటి పేర్లతో దొంగదెబ్బ తీయడం అన్యాయం.

గృహ వినియోగదార్లలో 70% మందికి పెంపుదల ప్రభావం ఉండదంటూనే కనెక్టెడ్ లోడ్ ఒక కిలో వాట్ మించిన వారంతా డిమాండ్ ఛార్జీలు చెల్లించాలని పేర్కొనడం అక్రమం. మధ్యతరగతి ప్రజలపై ఇది పెనుభారం మోపుతుంది. ఎల్.టి.వాణిజ్య వినియోగదారులకు డిమాండ్/ ఫిక్స్‌డ్ ఛార్జీలు నాలుగు రెట్లు పెంచడంతో పాన్‌షాపు మొదలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారిపై మరింత భారం పడుతుంది.

మిగులు విద్యుత్ ఉందిగనుక దాన్ని అమ్ముకోవడానికి విద్యుత్ వినియోగాన్ని పెంచాలన్న వైఖరి అనుసరించడం ఘోరమైన విషయం. “విద్యుత్ పొదుపు అంటే విద్యుత్‌ని ఉత్పత్తి చేయడమే” అన్న నినాదంతో పొదుపును ప్రోత్సహించిన ప్రభుత్వాలు ఇప్పుడు మరింత విద్యుత్‌ను వాడండి అని చెప్పడం తగదు. ఈ మాటల మాటున అత్యధిక విద్యుత్ వినియోగించే సంపన్నులకు, భారీ పరిశ్రమలకు విద్యుత్ ఛార్జీల పెంపుదలను తగ్గించే కుట్ర ఇది. డిమాండ్/ ఫిక్స్‌డ్ ఛార్జీలను, ఎనర్జీ ఛార్జీలను విడదీయడమేగాక డిమాండ్ ఛార్జీలు పెంచి ఎనర్జీ ఛార్జీలు తగ్గించడంవల్ల మధ్యతరగతి వారిపై భారం మోపి, సంపన్నులకు ప్రభుత్వం వెసులుబాటు కలిగిస్తుంది. ప్రస్తుతం వున్న 141 శ్లాబులను 97కు తగ్గించడం పేరుతో ఆయా శ్లాబుల్లోని కింది తరగతుల వారిపై భారం పెరుగుతుంది.

నిత్యజీవితావసర సరుకుల ధరలు పెరిగి, నోట్ల రద్దుతో అసలే ఉపాధి తగ్గి ఆదాయాలు కుదించుకుపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం కొత్తగా విద్యుత్ భారాలు మోపడం తగదు. ఛార్జీల పెంపుదల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి